క్లుప్తంగా

చందోలులో ఘనంగా 'హరిద్ర శృంగార్చన'

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్రశృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడారు. అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

పౌష్టికాహారం పంపిణీ



చెరుకుపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ పావని పేర్కొన్నారు. మండలంలోని రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగంలో అత్యుత్తమమైన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులు మరివాడ ప్రసాద్, స్థానిక సర్పంచ్ తాతా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పీటా రాంబాబు, ఉప సర్పంచ్ కోటిరెడ్డి, హెచ్‌ఎం పావులూరి లక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి



ఆళ్లమూడి(భట్టిప్రోలు): కుక్కలు దాడి చేసి, పది గొర్రెలను పొట్టనపెట్టుకున్నాయి. మండలంలోని ఆళ్లమూడి గ్రామానికి చెందిన నీలా రాఘవులు గొర్రెలు మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గొర్రెల మందను ఇంటి వెనుక భాగంలో కంచె వేసి, మలేశాడు. రాత్రి కుక్కలు మూకుమ్మడిగా మందపై దాడి చేయడంతో పది గొర్రెలు మృతి చెందాయి. అలికిడికి రాఘవులు లేచి చూడగా గొర్రెలు చచ్చిపడి ఉన్నాయి. లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు కుక్కల బెడదను నివారించాలని అతను కోరాడు.

60 మందికి వైద్యసేవలు



పిట్టలవానిపాలెం: గ్రామాల్లో ఇంటింటికీ వైద్యం అందిచడం జరుగుతుందని వైద్యులు లోకేష్ తెలిపారు. మండంలోని గోకరాజునల్లి బోయినవారిపాలెంలో శుక్రవారం 104 వైద్య సేవలు అందించారు. ఇంట్లో నుంచి బయటకు రాలేక మంచంలో ఉన్న రోగులకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో డీఈఓ సాయి కిషోర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కర్లపాలెం: కార్మిక కుటుంబాలకు భవన నిర్మాణ కార్మికుల సంఘం అండగా ఉంటుందని ఏఐటీయూసీ నాయకులు ఎస్కే కరిముల్లా తెలిపారు. కర్లపాలేనికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మంతెన శివరామరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం తరపున శుక్రవారం శివరామరాజు కుటుంబానికి రూ.3వేల నగదును ఏఐటీయూసీ నాయకులు ఎస్కే కరిముల్లా అంజేశారు. ఈ కార్యక్రమంలో అహ్మతుల్లా, షేక్ సమద్, జలీల్‌ఖాన్, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

చరిత్రలో చిరస్థాయిగా.. జగనన్న సంక్షేమ పథకాలు

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నగరం: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అమలు తీరు దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు, రాగద్వేషాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు, గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు ఐక్యంగా జగనన్న సంక్షేమ పాలనలో భాగస్వాములు కావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జగనన్న సంక్షేమ పథకాలే అభ్యర్థుల విజయానికి బాటలు కావాలన్న విషయం మరువద్దని స్పష్టం చేశారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. తొలుత మండల సచివాలయ కన్వీనర్ డాక్టర్ రాజా డిజిటల్ స్క్రీన్ ద్వారా గృహ సారథులు, సచివాలయ కన్వీర్లు, వలంటీర్లు నిర్వహించాల్సిన బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు చందోలు దేవదాసు, విచారపు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



దాతలు అందించిన సింహ, పెద్ద శేష వాహనాలు

చెరుకుపల్లి: మండలంలోని గూడవల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా స్వామిని పెండ్లి కుమారుని చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జంజనం సాంబశివరావు మాట్లాడుతూ గూడవల్లి గ్రామానికి చెందిన ప్రవాసభారతీయులు వాడపల్లి సీతారామ చంద్రమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య ఇంద్రాదేవి రూ.1.20లక్షలతో పెద్ద శేషవాహనాన్ని, స్వామివారి దేవాలయంలో అనువంశ అర్చకులు బృందావనం వంశీయులు రూ.70 వేలు విలువ చేసే సింహవాహనాన్ని బహూకరించినట్లు తెలిపారు.

పాత్రికేయ శిఖరం కోటంరాజు



నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు, విద్యార్థులు

బాపట్ల అర్బన్: జాతీయ పత్రికా రంగంలో తెలుగువారి సత్తా చాటిన వారిలో అగ్రగణ్యుడు కోటంరాజు రామారావు అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు అన్నారు. కోటంరాజు 62వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పటేల్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘాన్ని స్థాపించి, వారి సంక్షేమం కోసం పాటుపడ్డారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా, ప్రణాళికా సంఘం సలహాదారుగా దేశానికి విశిష్టమైన సేవలందించారు. కలం యోధుడు కోటంరాజు పటేల్ నగర్ బిల్డింగ్ సొసైటీ లో సభ్యుడిగా ఉన్నారని వెల్లడించారు. కోటంరాజు తన సంపాదకీయాలతో ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. సమరయోధ సంపాదకుడిగా ఖ్యాతికెక్కిన ఆయన ఆంగ్లేయుల ఆగ్రహానికి గురై జైలు శిక్ష అనుభవించారన్నారు. కార్యక్రమంలో రచయిత్రి చిల్లర భవానీ దేవి, ఫోరమ్ కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డబ్ల్యూ ఏజీకే మూర్తి, సొసైటీ కార్యదర్శి వెలగా శివరామయ్య, పటేల్ నగర్ పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, విశ్రాంత తాసిల్దార్ విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న సర్వసభ్య సమావేశం

కొల్లూరు: కొల్లూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించడంతోపాటు, అభివృద్ధి పనుల ఎజెండాపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లతో పాటు, మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరకావాలని పేర్కొన్నారు.

బాపట్ల ఏరియా వైద్యశాలలో వైద్య విద్యార్థులు

బాపట్ల: బాపట్ల ఏరియా వైద్యశాలలో 12 మంది పీజీ వైద్యులు మూడు నెలల పాటు ప్రజలకు మరిన్ని వైద్య సేవలందించనున్నారు. గుంటూరు ఎన్నారై, కాటూరి వైద్యశాలల నుంచి 12 మంది పీజీ వైద్య విద్యార్థుల బృందం శుక్రవారం బాపట్లకు చేరింది. వీరందరూ మూడు నెలలు పాటు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి, అన్ని వైద్య సేవలను అందిస్తారని, వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలిపారు.

7న ప్రత్యేక పూజా కార్యక్రమాలు


భట్టిప్రోలు: మండలంలోని పెదపులివర్రులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 7న పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక విష్ణు సహస్ర నామ, సహస్ర దీపోత్సవం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ అఖిలాండకోటి అఖండ జ్యోతి నిర్వాహకులు శ్రీ రామ్‌జీ గురువు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గత నెల 9 నుంచి జరుగుతున్న సప్త సప్తాహములు ఈ నెల 31న పూర్ణాహుతితో ముగుస్తుందని పేర్కొన్నారు.

జన ఔషధి దివస్



తెనాలి: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన వార్షికోత్సవం 5వ జన ఔషధి దివసు-2023ను శుక్రవారం తెనాలిలో నిర్వహించారు. తెనాలిలోని జన ఔషధి దుకాణంలో నిర్వహించిన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 1759 రకాల మందులు, 280 సర్జికల్ రకాలు ప్రభుత్వం నిర్దేశించిన అతి తక్కువ ధరకే అందుబాటులో ఉన్నట్లు వివరించారు. స్త్రీ మూర్తుల గౌరవార్థం ఈ ఉత్సవాన్ని జరిపినట్లు చెప్పారు. పద్మావతి, మహిళా సంఘం యానిమేటర్ డి.పద్మావతి, ప్రజా స్వామ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆర్.సేవక్రాంతి, కోశాధికారి పద్మావతి, డి.ఏడుకొండలు, నోడల్ ఆఫీసర్ అల్లు హరికృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు శౌరిబాబు

రేపల్లె: పాతకక్షల నేపథ్యంలో దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పట్టణ సీఐ విజయచంద్ర తెలిపారు. రేపల్లె మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బాతాటి శౌరిబాబు(30)ను అదే గ్రామానికి చెందిన బట్టు కన్నయ్య ఈ నెల 1న కత్తితో పొడిచి గాయపరిచాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న శౌరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు. శౌరిబాబు చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య క్రాంతి, ఇరువురు కుమారులు ఉన్నారు. శౌరిబాబు మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని రుద్రవరం గ్రామంలో కుటుంబీకులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ భరత్ ఘటనా స్థలానికి చేరుకుని దోషులను కఠినంగా శిక్షిస్తామని బాధితులను ఆందోళనను విరమింపజేశారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన టాటా సుమో

రేపల్లె రూరల్: వ్యాన్ బోల్తాపడిన ఘటన పట్టణ శివారులోని గుడ్డికాయ లంక అక్కిలేరు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన నాగబాబు రేపల్లె పట్టణం నుంచి అడవులదీవి గ్రామానికి ఐస్‌బాక్స్‌లను తన వ్యాన్‌లో తీసుకెళ్తున్నాడు. పట్టణ శివారులోని అక్కిలేరు వద్ద ఎదురుగా వస్తున్న లారీని, మరోవైపు నుంచి వస్తున్న గేదలను తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న దిమ్మను ఢీకొని బోల్తా కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ నాగబాబుకు స్వల్పగాయాలు అవ్వగా వ్యాన్ దెబ్బతింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ముగిసిన కుట్టు శిక్షణ



రేపల్లె: పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో రెండు నెలల నుంచి నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 26వ బ్యాచ్ మహిళలకు శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో.. ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు మాట్లాడుతూ 27వ బ్యాచ్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయని, ఆసక్తి కలిగిన మహిళలు ఎంసీఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. శిక్షణ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు కుట్టుమిషన్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ తరగతుల్లో ప్రతిభ కనపరిచిన ఉమా అనే మహిళకు కుట్టుమిషన్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి జి.బాపారావు, సభ్యులు సాయిప్రసాద్, నంబూరి సత్యప్రసాద్, ట్రైనర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



భట్టిప్రోలు: భట్టిప్రోలు సచివాలయంలో శుక్రవారం 'బేటీ బచావో-బేటీ పడావో' అవగాహన సమావేశం జరిగింది. హెల్త్ విజిటర్ కల్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక సర్పంచ్ దారా రవికిరణ్మయి పాల్గొన్నారు. సచివాలయం-2 పరిధిలో సిద్ధార్థ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో-బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గూరించి వివరించారు. ఈ సమావేశాలలో సీహెచ్‌ఓ డి.మాతయ్య, హైస్కూల్ ప్రిన్సిపల్ వి.భారతి, కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ జి.బ్యూలా, కరీమా, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు, ఆకుకూరలతో ఆరోగ్య సంరక్షణ..



పేరలి(కర్లపాలెం): ఆరోగ్య సంరక్షణకు చిరుధాన్యాలు, ఆకుకూరలు దోహదపడుతాయని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎం.రమాదేవి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన పేరలిలో శుక్రవారం ఆకుకూరలు, చిరుధాన్యాలపై మహిళలకు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ రమాదేవి మాట్లాడుతూ తాజా ఆకుకూరలను, పండ్లను బ్లాంచింగ్ పద్ధతిలో నిలవ చేసుకోవాలని చెప్పారు. చిరు ధాన్యాలతో లడ్డూలు, మల్టీగ్రెయిన్ పౌడర్ తయారు చేసుకొని నిలువ చేసుకోవచ్చన్నారు. అవిశగింజల పొడి, కొర్రల పాయసం, మొదలగు ఆహార పదార్థాల ద్వారా మధుమేహం, కొలెస్ట్రాలన్ నియంత్రించుకోవచ్చని చెప్పారు. పాలతో పన్నీరు, పాలకోవ, ఉసిరితో జామ్, జెల్లీ, పచ్చడి తయారు చేసుకునే పద్ధతులను మహిళలకు వివరించారు. తాజా ఆకుకూరలు, పండ్లు ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు సి.సంధ్యారాణి, విజయ్ కుమార్, విమల, ఏఈవో భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు తిరుమలేశ్వరరావు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

పెదపులివర్రులో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



శ్రీ వరదరాజస్వామి వారు



శ్రీ భూనీళా అమ్మవారు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సహస్ర దీపారాధన, ఋత్వికరణం, రక్షా బంధనం, వేదిని పూజ, అంకురారోపణ, వాస్తు పూజా హోమం, ధ్వజపట ప్రతిష్ట శాస్త్రయుక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం పంచాహ్నికంగా, వైభవంగా ఫాల్గుణ పౌర్ణమికి జరగనున్నది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నెల 9న వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు తెలిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంఠంనేని హరిప్రసాద్, సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం సోమవారం శ్రీవారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, మంగళవారం రథోత్సవం జరగనున్నాయి.

స్వయంగా రైతులే విత్తనాలను తయారు చేసుకోవచ్చు

బాపట్ల రైతు శిక్షణ కేంద్రం డీడీఏ విజయనిర్మల



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారులు

పిట్టలవానిపాలెం: రైతులు తమకు అవసరమైన విత్తనాలను తామే తయారు చేసుకోవచ్చని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం డీడీఏ విజయనిర్మల తెలిపారు. మండలంలోని పోతనకట్టవారిపాలెంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం, గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు రకాల సూచనలు చేశారు. రైతులు వరి విత్తనాలను తామే తయారు చేసుకోవచ్చని తెలిపారు. కేళీలు లేకుండా వరి మడిలోనే శుభ్రం చేసుకోవాలని సూచించారు. నూర్పిడిని వేరుగా చేసి, తేమ తగలని ప్రదేశంలో బస్తాలను నిల్వ చేసుకోవాలని చెప్పారు. నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు అవసరమైన విషయాలను సలహా మండలిలో తెలియజేయాలని సూచించారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యం క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సాంబశివరావు, ఉమా మహేశ్వరి, బాపట్ల ఏడీఏ లక్ష్మి, మండల వ్యవసాయాధికారి సత్యానంద్, వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్‌రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి ఆలయ మహోత్సవాలు



స్వామిని దర్శించుకొన్న వేమూరు సీఐ వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివార్లకు బిందె తీర్థం, అభిషేకం, నిత్యావపోసన, బలిహరణ పూజలు జరిగాయి. వేమూరు సీఐ కె. వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు, అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్తలు కొడాలి పానకాలరావు, రామశాస్త్రి, శంకరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా రాత్రి శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర భక్త భజన సమాజం ఆర్గనైజర్ కొలుసు నాగమ్మ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది. రాత్రి స్వామివార్లకు పుష్ప సేవ నిర్వహించారు.

నేడు జేసీ పర్యటన

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శనివారం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లే-అవుట్లలో గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.